క్లుప్తంగా

దాడి కేసులో ఇద్దరి అరెస్టు



అరెస్టు చూపుతున్న పోలీసులు

రామడుగు: దాడి కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ ఆర్.ప్రకాశ్‌గౌడ్, ఎస్సై సురేందర్ తెలిపారు. వారి వివరాల ప్రకారం.. రామడుగు మండలంలోని దత్తోజిపల్లికి చెందిన తొట్ల రాములు, మల్లయ్య, ముత్తయ్య అన్నదమ్ములు. కొన్ని రోజులుగా వ్యవసాయ భూముల విషయంలో గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం మల్లయ్య, ముత్తయ్య ద్విచక్రవాహనంపై వెళ్తుండగా దత్తోజిపల్లి శివారులో రాములు, అతని కుమారుడు మహేందర్ కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను గ్రామస్తులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. మల్లయ్య కుమారుడు నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

మగ వరి ధాన్యం కొనుగోలు చేయాలి

జమ్మికుంట: రైతుల సీడ్ వరికి సంబంధించి మగ వరి ధ్యాన్యాన్ని బీగ్రేడ్ రకంగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీజేపీ మండల యూత్ నాయకుడు కొండ హరీశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు మగ వరి ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.1,200తో దళారులకు విక్రయించి, మోసపోతున్నారని అన్నారు.

పంచాయతీ సిబ్బందికి నిత్యావసరాలు పంపిణీ



రామడుగు: స్థానిక గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు కొన్ని నెలలుగా జీతాలు రాకపోవడంతో వారి పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న ఎన్ఆర్ఐ తోట సత్యం(యూఎస్ఏ) వెంటనే స్పందించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 11 మందికి ఒక్కొక్కరికి రూ.2,500 విలువైన నిత్యావసర సరుకులను సమకూర్చారు. వాటిని శుక్రవారం సత్యం ఇంటి వద్ద నాగి లచ్చయ్య, చందా పోచాలు, చందా అనిల్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ నాగరాజు

చొప్పదండి: పట్టణంలోని అంగడి బజార్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ నాగరాజు శుక్రవారం ప్రారంభించారు. వారసంతకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు దారుల్ ఖైర్ సొసైటీ సభ్యులు దీన్ని ఏర్పాటు చేశారు. జహీరుద్దీన్, అబిద్ అలీ, డాక్టర్ ఖుద్దూస్, రిజ్వాన్‌అలీ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట 33/11 కేవీ, మాచనపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మికుంట పట్టణంలోని మోత్కులగూడెం, ఇండస్ట్రీస్ ఏరియా, మారుతీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, అంబేడ్కర్‌కాలనీ, మార్కెట్, మసీదు ఏరియా, మాచనపల్లి గ్రామం, కృష్ణ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ, గాంధీ చౌరస్తా, వీణవంక రోడ్డు, కొండూరి కాంప్లెక్స్, శాలవాడ, సివిల్ హాస్పిటల్, అబాది జమ్మికుంట, కేశవపూర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని వెంకట్రావుపల్లి, రాజపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రవీందర్ తెలిపారు.

చిగురుమామిడి మండలంలో భారీ వర్షం

చిగురుమామిడి: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సీతారాంపూర్, ఇందుర్తి, రామంచ, ముదిమానిక్యం, నవాబుపేట్ తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తి కాలేదు. వర్ష సూచనతో రైతులు అప్రమత్తమై, ఆరబోసిన ధాన్యాన్ని కుప్ప చేసి, టార్పాలిన్లు కప్పారు. కాగా, ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదని తహసీల్దార్ నరేందర్ తెలిపారు.

దుమ్ము చేరి.. డోర్లు చోరీ

- నిర్వహణ లేక అధ్వానంగా రైతు వేదికలు
- కంపు కొడుతున్న మరుగుదొడ్లు
- కొన్ని గ్రామాల్లో మందుబాబులకు అడ్డా..
- తలుపులను ఎత్తుకెళ్తున్న దొంగలు
- మానకొండూర్ మండలంలో పరిస్థితి



గట్టుదుద్దెనపల్లిలో ఊరికి దూరంగా ఉన్న రైతు వేదిక

మానకొండూర్: రైతుల ప్రయోజనం కోసం నిర్మించిన రైతు వేదికల పరిస్థితి అధ్వానంగా మారింది. నిర్వహణ లేకపోవడంతో వాటి మరుగుదొడ్లు కంపు కొట్టుతున్నాయి. పలుచోట్ల రైతు వేదికల గదులు, మరుగుదొడ్ల డోర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. ఊరికి దూరంగా ఉన్నవేమో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. రైతు వేదికలు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయని ప్రజలు అంటున్నారు.

ఒక్కోదానికి రూ.20 లక్షలకు పైగా ఖర్చు..

మానకొండూర్ మండలంలో ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి గత ప్రభుత్వం ఉపాధిహామీ నిధులు రూ.20 లక్షలకు పైగా ఖర్చు చేసింది. కొండపలక్కల, దేవంపల్లి, లక్ష్మీపూర్, గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల, మానకొండూర్, పచ్చునూర్ గ్రామాల్లో స్థలం ఉన్నచోట నిర్మించారు. వీటిలో కొండపల్కల, పచ్చునూర్, గట్టుదుద్దెనపల్లి, దేవంపల్లి వేదికలు ఊరికి దూరంగా ఉన్నాయి. అయితే, ఇవి రైతులు, వ్యవసాయాధికారుల సమావేశాలకే ఉపయోగపడుతున్నాయి. నెలలో ఒకటో, రెండో సమావేశాలు ఉంటేనే ఎక్కువ. గ్రామానికి దగ్గరగా ఉన్న రైతు వేదికలకు సంబంధిత ఏఈవోలు అప్పుడప్పుడు వచ్చామా.. వెళ్లామా అన్నట్లు వస్తున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు సరిగా లేవు. రైతు వేదికలు దుమ్ముతో నిండిపోయాయి. వాటి తాళాలు తీసేందుకు అధికారులు జంకుతున్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించినప్పుడు వ్యవసాయాధికారులే గ్రామ పంచాయతీ సిబ్బందికి రూ.100, రూ.200 చెల్లించి, రైతు వేదికలను శుభ్రం చేయిస్తున్నారు. ఇటీవల గట్టుదుద్దెనపల్లి వేదిక తలుపులను దొంగలు ఎత్తుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిర్వహణ చేపడితే మేలు..

లక్షల రూపాయలతో నిర్మించిన రైతు వేదికలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అవి విశాలంగా ఉండి, గ్రామీణులు సమావేశాలు, ఫంక్షన్లు జరుపుకునేందుకు అనువుగా ఉన్నాయి. వేదికల నిర్వహణ చేపడితే మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. రైతు వేదికలను సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు ఇవ్వడం ద్వారా వచ్చే రుసుముతో ఇది సాధ్యమేనన్న అభిప్రాయాన్ని ప్రజలు, అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటేనే వాటికి మనుగడ ఉంటుందని పేర్కొంటున్నారు.



తలుపులు చోరీ అయిన గట్టుదుద్దెనపల్లి వేదిక



దుమ్ముతో నిండిపోయి ఇలా..



చెంజర్ల వేదికలో అధ్వానంగా మరుగుదొడ్డి

గ్రానైట్ క్వారీలో కార్మికుడికి తీవ్ర గాయాలు

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు–చింతలపల్లి గ్రామాల గ్రానైట్ క్వారీలో ఓ కార్మికుడి కంటికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల గ్రానైట్ క్వారీలో కంప్రెషర్ ట్రాక్టర్‌తో పేలుళ్లు జరిపారు. వాటికి సంబంధించిన రాళ్ల ముక్కలు నల్లగొండ జిల్లాకు చెందిన కరుణాకర్ కళ్లలో పడి, తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా క్వారీ యాజమాన్యం అతన్ని గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్‌లోని ఓ కంటి ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తోంది. సదరు ఆస్పత్రి వైద్యులు స్థానిక ఎస్సై లక్ష్మారెడ్డికి సమాచారం అందించారు. దీనిపై ఆయనను వివరణ కోరగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం డాక్టర్ల ద్వారా తెలిసిందని, తమకు ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

మట్టి ట్రాక్టర్లు సీజ్

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో శుక్రవారం అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు కేశవపట్నం ఎస్సై లక్ష్మారెడ్డి తెపారు. మైనర్లు ట్రాక్టర్లను నడపడాన్ని గమనించిన స్థానికులు తమకు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే తనిఖీలు చేపట్టి, పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

గడువు దాటిన స్టాక్ విక్రయించొద్దు

- డీఏవో శ్రీనివాస్
- చొప్పదండిలో ఎరువులు, విత్తన దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏవో శ్రీనివాస్

చొప్పదండి: మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను డీఏవో శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడువు దాటిన స్టాక్ విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో వంశీకృష్ణ, డీలర్లు ఉన్నారు.

‘ఉపాధి’ కూలీలకు సౌకర్యాలు కల్పిస్తున్నాం

- చిగురుమామిడి ఎంపీడీవో మధుసూదన్

చిగురుమామిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు. శుక్రవారం చిగురుమామిడి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండ తీవ్రతకు 2,100 నుంచి 2,500 మంది కూలీలు మాత్రమే పనులకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచామని, సేదతీరేందుకు గ్రీన్ నెట్లు వేశామని, ఓఆర్ఎస్, చల్లా ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కూలీలకు నాలుగు వారాల వేతనాలకుగానూ మూడు వారాలవి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేకాధికారులకు సూచనలిస్తూ అభివృద్ధిలో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

నవధాన్యాలు చల్లుకుంటే ఎంతో మేలు



నవధాన్యాలు చల్లిన రైతు, సంస్థ క్షేత్ర సహాయకుడు

ఇల్లందకుంట: భూమిలో నవధాన్యాలు చల్లుకుంటే ఎంతో మేలని భారత సుస్థిర సంస్థ క్షేత్ర సహాయకుడు రావుల రాకేశ్ అన్నారు. శుక్రవారం ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామంలో పెనుకుల దేవేందర్ వ్యవసాయ క్షేత్రంలో సంస్థ ఆధ్వర్యంలో నవధాన్యాలు చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవధాన్యాలు వేసుకోవడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని తెలిపారు. గొర్రెలు, పశువుల ఎరువు, చెరువు మట్టి చల్లితే సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, నేల సారవంతం అవుతుందని పేర్కొన్నారు. వరి కొయ్యకాలును కాల్చడం వల్ల భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని, కాల్చకుండా నేలలోనే కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



హుజూరాబాద్‌లో ఉత్సవాలు



చొప్పదండిలో పూజలు చేస్తున్న భక్తులు

హుజూరాబాద్: పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి జరిగి, 331 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నవగ్రహ పూజ, హోమం, బ్రహ్మంగారి సజీవ సమాధి ఘట్టం, పూజా కార్యక్రమాలను కోటగిరి ప్రవీణ్ శర్మ చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు కస్తూరి నరేంద్రాచారి, మునిగంటి నాగరాజు, రావుల వేణు, తేలుకుంట్ల వేణు, శ్రీను, రావుల భిక్షపతి, స్వర్ణకార సంఘం, మనుమయ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. పాన్నోజు పావని–మనోహర్ దంపతులు అన్నదానం చేశారు. స్వర్ణకార సంఘం అధ్యక్షుడు గుగ్గిల రాజేంద్రప్రసాద్, పాన్నోజు సుధాకరాచారి, రంగు పండరి, వలబోజు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని శ్రీహరిహర క్షేత్రంలో శుక్రవారం శ్రీపోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన గురుపూజ మహోత్సవం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం చొప్పదండి పట్టణ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం, ఆలయ ఆవరణలో హోమం జరిపించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

‘అమ్మ’ ఆధ్వర్యంలో ప్రతీరోజు అల్పాహారం



రాగి జావ అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

వీణవంక: గ్రామస్తుల దాహార్తి తీర్చడంతోపాటు ప్రతీరోజు ఉదయం అల్పాహారం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు వీణవంక మండలంలోని మల్లారెడ్డిపల్లి అమ్మ ఫౌండేషన్ నిర్వాహకులు. ఎండల తీవ్రత దృష్ట్యా వ్యవసాయ పనులకు వెళ్లేవారి దాహార్తిని తీర్చేందుకు 20 రోజుల క్రితం గ్రామ కూడలిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో నిత్యం మంచినీటిని ఏర్పాటు చేయడంతోపాటు ఉదయం అల్పాహారం అందిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలవారు కూడా ఇక్కడికి వచ్చి, తింటున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన పల్లెర్ల శేఖరయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు రాగిజావ పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకుల సేవలను గ్రామస్తులు అభినందిస్తున్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో అమ్మ ఫౌండేషన్‌ను స్థాపించామని సంస్థ సభ్యుడు గోనెల సమ్మయ్య తెలిపారు. తమ ఊరిలో 95 శాతం మంది వ్యవసాయ పనులు చేసుకునేవారేనని, ఎండలో వెళ్లి అనారోగ్యానికి గురికావొద్దని ఉదయమే అల్పాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

వరి కొయ్యకాలును కాల్చొద్దు

- భూసారం దెబ్బతిని దిగుబడిపై తీవ్ర ప్రభావం
- భవిష్యత్తులో పంటలు పండవు..
- తెలియక కాల్చేస్తున్న రైతులు
- అవగాహన కల్పించాలని మంత్రి తుమ్మల ఆదేశం
- ప్రారంభమైన వానాకాలం సీజన్ పనులు
- జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా



వీణవంకలో గురువారం కాలిపోతున్న కొయ్యకాలు

వీణవంక: వరి కొయ్యకాలు కాల్చడం వల్ల భవిష్యత్తులో పంటలు పండని దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. భూసారం దెబ్బతింటుంది. కొయ్యకాలు తగలబెట్టకుండా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల అధికారులను ఆదేశించారు. అయితే, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ప్రమాదవశాత్తో లేక అవగాహన లేని రైతులే తగలబెడుతున్నారో గానీ చాలా ఎకరాల్లో కొయ్యకాలు కాలిపోతోంది. కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని బేతిగల్ శెమ్మత్‌కుంట శివారులో గురువారం వందల ఎకరాల్లో కొయ్యకాలు కాలిపోయింది.

25 నుంచి రోహిణి కార్తె..

యాసంగి వరి కోతలు పూర్తయ్యాయి. ఈ నెల 25వ తేదీ నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుంది. దీంతో రైతులు వానాకాలం సాగు పనులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అవగాహన లేక రైతులు కొన్నిచోట్ల వరి కొయ్యలను కాల్చేస్తున్నారు. జిల్లాలో హుజూరాబాద్, మానకొండూరు నియోజకవర్గాల్లో వ్యవసాయ పనులు ముందస్తుగా జరుగుతుంటాయి. ఈసారి జిల్లా వ్యాప్తంగా 2.90 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

కాల్చడం వల్ల కలిగే నష్టాలు..

- వరి కొయ్యలు తగలబెట్టిన ప్రాంతంలో భూమి బిగువుగా మారి, నీటిని పీల్చుకునే గుణాన్ని కోల్పోయే అవకాశం ఉంటుంది.
- కాల్చిన చోట భూమి సేంద్రియ పదార్థాన్ని కోల్పోతుంది.
- వరి కొయ్యలను ఏటా కాల్చడంతో వాయు కాలుష్యం ఏర్పడుతుంది.
- పంటలకు తోడ్పడే సూక్ష్మజీవులపై తీవ్ర ప్రభావం పడుతుంది.

ఇలా చేస్తే మేలు..

- పొలం దున్నే 10 రోజుల ముందు గడ్డిని పొలంలో పరిచి నీరందించాలి. తర్వాత ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్ఫేట్‌ను చల్లాలి. దీంతో భూమి దెబ్బతినడం నుంచి తప్పించడమే కాక భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచవచ్చు. ఈ పద్ధతి పాటించడం వల్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి, దిగుబడులు పెరుగుతాయి.

> **పొలంలోనే ఉంచాలి**
>
> రైతులు వరి పంట కోసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ కొయ్యకాలును తగలబెట్టొద్దు. కాల్చేస్తే భూసారం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ విషయంపై ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కల్పించాం. కొయ్యకాలును పొలంలోనే ఉంచాలి. జీలుగ, పిల్లిపెసర వంటివి సాగు చేయడం వల్ల భూసారం వృద్ధి చెందుతుంది. కొయ్యకాలు కాల్చేస్తే సూక్ష్మజీవులు చనిపోయి, పంట దిగుబడి తగ్గిపోతుంది.
>
> – శ్రీనివాస్ రెడ్డి, శాస్త్రవేత్త, కేవీకే, జమ్మికుంట

- ఏటా కోల్పోతున్న భూసారాన్ని వృద్ధి చేసుకునేందుకు పొలాల్లో జనుము, పిల్లి పెసర, జీలుగ సాగు చేయాలి. సాధ్యమైనంత వరకు రసాయన మందుల వాడకం తగ్గించాలి.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



కరీంనగర్‌రూరల్: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైసుమిల్లులకు తరలించాలని సివిల్ సప్లయి డీఎం రజనీకాంత్, డీఎస్‌వో సురేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం నగునూరు, వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగునూరులో త్వరగా కాంటా పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. ప్రస్తుతం మూడు రైసు మిల్లులకు ధాన్యం తరలిస్తుండగా అదనంగా మరో రెండు మిల్లులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. అకాల వర్షాల దృష్ట్యా కాంటా పెట్టిన వెంటనే ధాన్యం బస్తాలను లారీల్లో రైసుమిల్లులకు తరలించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సింగిల్‌విండో సీఈవో రమేశ్, డైరెక్టర్ సాయిల్ల మహేందర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి

- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

హుజూరాబాద్: రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం హుజూరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సన్న వడ్లకే రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రకటనలు వస్తున్నాయన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం అందుకు తగ్గట్లు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర రైతులు 80 శాతం దొడ్డు వడ్లను, 20 శాతం మాత్రమే సన్న వడ్లను పండిస్తారనన్నారు. కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో బోనస్ విషయమై సన్న, దొడ్డు వడ్లు అంటూ ఎక్కడా ప్రస్తావించలేదని తెలిపారు. అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని, ఈ యాసంగి సీజన్ నుంచే వర్తింపజేయాలని, మామిడి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు వెలమారెడ్డి రాజిరెడ్డి, జిల్లా నాయకుడు గుండేటి వాసుదేవ్, మండల నాయకులు ఎండీ.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు

చిగురుమామిడి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే నెల 6వ తేదీ వరకు అమల్లో ఉంటుందని, గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో మద్యం అక్రమ రవాణా, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 309 మందిని తహసీల్దార్ నరేందర్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. అలాగే, 8 ఎక్సైజ్ కేసులు కూడా నమోదు చేశామని తెలిపారు. ఇందుర్తిలో గంజాయితో పట్టుబడిన వ్యక్తిని జైలుకు పంపించామని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు, దేవాలయాల పరిసరాల్లో మద్యం సేవించినా, జూదం ఆడినా కేసులు నమోదు చేస్తామన్నారు.

గ్రానైట్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీ ఎన్నిక

కొత్తపల్లి(కరీంనగర్): గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ జిల్లా తాత్కాలిక అడ్వైజరీ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కొత్తపల్లి మండలంలోని ఎలగందుల గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సభ్యులు సీహెచ్.శ్రీనివాస్, మధుసూదన్, అడ్వకేట్ వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 18 మంది సభ్యులతో కమిటీని నియమించారు. జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీస్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరిగే వరకు ఈ వర్కింగ్ కమిటీ పని చేస్తుందని వారు ప్రకటించారు. అసోసియేషన్ సభ్యులుగా జువ్వాడి ప్రణీత్‌రావు, నరేస్ రాచకొండ, బూర సాగర్, గుడిపాటి సుదర్శన్‌రెడ్డి, విక్రం, టి.సతీష్‌రావు, పెద్ది సత్యనారాయణ, సోమినేని కనకయ్య, జుట్టు మధు, కె.సత్యనారాయణరెడ్డి, సోమినేని కరుణాకర్, ఆర్.మహేశ్‌కుమార్, షేక్ భాష, సిరి గోపాల్, సాగి సాగర్‌రావు, ఆర్.రామ్‌భూపాల్ రెడ్డి, టి.శ్యాం రావు, ఈశ్వర్‌రెడ్డి దువ్వాడి ఎన్నికయ్యారని పేర్కొన్నారు.